ఖరీఫ్ సాగుకు సన్నద్ధం

- గ్రామాల్లో మట్టి నమూనాల సేకరణ
- వేసవి దుక్కులు ప్రారంభించిన రైతులు
- నియోజకవర్గంలో సుమారు 32,663 హెక్టార్లలో సాగు
- ఈ నెల 27న నైరుతి పవనాల ఆగమనం
- పెట్టుబడి సాయం కోసం రైతులు ఎదురు చూపులు


దుక్కులు దున్నుతున్న రైతులు

బుట్టాయగూడెం: ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. అకాల వర్షాలు ఆశాజనకంగానే పడుతున్నాయి. గత ఏడాది కంటే ఈ ఏడాది ముందుగానే వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతవరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో రైతులు వేసవి దుక్కులు దున్నడం ప్రారంభించారు. ఈ నెల 27 తేదీకి నైరుతి పవనాలు వస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో ఖరీఫ్ సీజన్‌పై అధికారులు సాగు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే గ్రామాల్లో భూసార పరీక్షలు చేసి సూక్ష్మ పోషకాలు అందించేందుకు మట్టి నమూనాలను సేకరిస్తున్నారు. అలాగే సాగుదారు కార్డుల జారీకి అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. రైతుల పంటల సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, అందుబాటులో ఉంచేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నియోజకవర్గంలో సుమారు 32,663 హెక్టార్లలో సాగు

ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి పోలవరం నియోజకవర్గంలోని 7 మండలాల పరిధిలో సుమారు 32,663 హెక్టార్లలో పంట సాగు చేసేవిధంగా రైతులను ప్రోత్సహిస్తామని అధికారులు చెప్పారు. బుట్టాయగూడెం మండలంలో 6562 హెక్టార్లు, జీలుగుమిల్లి మండలంలో 4749 హెక్టార్లు, పోలవరం మండలంలో 3328 హెక్టార్లు, కొయ్యలగూడెం మండలంలో 6257 హెకార్లు, టి.నర్సాపురం మండలంలో 9729 హెక్టార్లు, వేలేరుపాడు మండలంలో 1160 హెక్టార్లు, కుక్కునూరు మండలంలో 878 హెక్టార్లలో వరి, మొక్కజొన్న, పెసలు, వేరుశనగ, మినుములు, జొన్న తదితర పంటలు రైతులు పండించే విధంగా కృషి చేస్తామని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

పెట్టుబడి సాయం కోసం రైతుల ఎదురు చూపులు

అకాల వర్షాలు ఆశాజనకంగా పడుతున్నాయి. ఖరీఫ్ సీజన్ రానే వచ్చింది. రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. ఓ వైపు విత్తనాల కోసం వెతుకులాట ప్రారంభమైంది. మరో వైపు సాగుకు పెట్టుబడి కోసం రైతులు వెయ్యి కళ్లలో ఎదురు చూస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సమయానికి సమకూర్చి రైతులకు అన్ని విధాల అండగా ఉన్నారు. అలాగే రైతు భరోసా పథకంలో ఏటా రూ.13,500 చొప్పున ఐదేళ్లపాటు రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం అందించారు. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసి ఏటా రూ.20 వేలు ఇస్తామని ప్రకటించింది. కాని నేటికీ అమలు చేయలేదు.

మండలం	సాగు విస్తీర్ణం
బుట్టాయగూడెం	6562 (హెక్టార్లు)
జీలుగుమిల్లి	4749
వేలేరుపాడు	1160
కుక్కునూరు	878
టి.నర్సాపురం	9729
కొయ్యలగూడెం	6257
పోలవరం	3328

మట్టి నమూనాలు సేకరించాం



పంట పొలాల్లో భూసారం తెలుసుకొని సూక్ష్మపోషకాలు అందించేందుకు మట్టి నమూనాలు సేకరించాం. ఇప్పటి వరకూ సుమారు 1140 మట్టి నమూనాలు సేకరించాం. మట్టి నమూనాల ఫలితంగా సాగుపై దృష్టి సారించాల్సి ఉంది. ఇప్పటికే అకాల వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. నైరుతి రుతు పవనాలు వచ్చే అవకాశం ఉన్నందున రైతులను సాగుకు సన్నద్ధం చేస్తున్నాం.

–డి.ముత్యాలరావు, మండల వ్యవసాయ అధికారి, బుట్టాయగూడెం

ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందించాలి



ఖరీఫ్ సీజన్ రానే వచ్చింది. పంటల సాగుకు రైతులకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకంలో పెట్టుబడం సహాయం అందించాలి. అలాగే ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు సకాలంలో అందేలా కృషి చేయాలి.

–తెల్లం బాలరాజు, మాజీ ఎమ్మెల్యే, దుద్దుకూరు, బుట్టాయగూడెం మండలం

క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు



జంగారెడ్డిగూడెం: మండలంలోని గురవాయిగూడెం గ్రామంలో వేంచేసియున్న శ్రీహరిహర సుత అయ్యప్పస్వామి దేవస్థానంలో మంగళవారం సందర్భంగా ఉపాలయమైన శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో పంచామృత అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించినట్లు అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

జంగారెడ్డిగూడెం: మండలంలోని మైసన్నగూడెం గ్రామంలో జరుగుతున్న అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా మంగళవారం శాస్త్రోక్తంగా అగ్ని మదనం చేసి విశేష హోమాలు నిర్వహించారు. యంత్రమూర్తులకు విగ్రహమూర్తులకు విశేష కార్యక్రమంలో ధాన్యాధివాసం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమం నిర్వాహకులు బ్రహ్మశ్రీ ఈమని శశి కుమార్‌శర్మ మాట్లాడుతూ 21వ తేదీ బుధవారం ఉదయం 9.04 గంటలకు ప్రతిష్ఠా మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. బ్రహ్మశ్రీ సాధు పవన్ కుమార్‌శర్మ బ్రహ్మోత్సవంలో పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూజా కార్యక్రమాల్లో వామిశెట్టి గంగాధర్ దంపతులు, వామిశెట్టి కృష్ణ దంపతులు, చీమల మురళీకృష్ణ దంపతులు, కురుమళ్ల శ్రీనివాస దంపతులు ఉభయధారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో కుర్రు సుబ్బారావు, వామిశెట్టి నాగేశ్వరరావు, వామిశెట్టి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ వేళల్లో మార్పులు


విద్యుత్ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్

జంగారెడ్డిగూడెం: విద్యుత్ డివిజన్ పరిధిలో గ్రీన్‌ఫీల్డ్ హైవే పైన వెళుతున్న ట్రాన్స్‌కో టవర్ లైన్ల మార్పు కోసం ఈ నెల 22 నుంచి జూన్ 1వ తేదీ వరకు వ్యవసాయ విద్యుత్ సమయాల్లో మార్పు చేశామన్నారు. ఈ మార్పు జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు వర్తిస్తుందన్నారు. ఏ గ్రూప్‌లో ఉదయం 2 నుంచి నుంచి 11 గంటల వరకు, బీ గ్రూప్‌లో ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు, రాత్రి 10 నుంచి 12 గంటల వరకు సరఫరా ఉంటుందని విద్యుత్ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణా తరగతులు


పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

లింగపాలెం: ధర్మాజీ గూడెం శాఖా గ్రంథాలయంలో ఉచిత వేసవి శిక్షణా తరగతులను ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి సీహెచ్‌వీ రమణ తెలిపారు. మంగళవారం ముందుగా విద్యార్థులకు దశావతారాల్లో ఏడోది శ్రీరామావతారం గురించి గ్రంథాలయ అధికారి రమణ వివరించారు. విద్యార్థులచే కథలు చెప్పించి, విద్యార్థులచే వారికి నచ్చిన పుస్తకాలు చదివించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి, 16 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలి


నినాదాలు చేస్తున్న నాయకులు

జంగారెడ్డిగూడెం: ఉపాధి హామీ పథకాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని పంగిడిగూడెం, పేరంపేట, పట్టిన్నపాలెం, ఎ.పోలవరం, తాడువాయి, మైసన్నగూడెంలో మంగళవారం ఉపాధి హామీ పనుల ప్రాంతంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామ సచివాలయం కార్యదర్శులకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలు అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం, మండల కార్యదర్శి అందుగుల ప్రభాకర్‌రావు, యాగంటి సీత, జోడే సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక

నిడమర్రు: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం కలిసినట్టు ఆ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నౌడు వెంకటరమణ తెలిపారు. అధినేతను మర్యాదపూర్వకంగా కలిసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా అధినేత పలు సూచనలు చేశారని తెలిపారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా: గురజాల


గురజాల పార్థసారథి

జంగారెడ్డిగూడెం: మండలంలోని టిక్కినవారిగూడేనికి చెందిన గురజాల పార్థసారథి వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు, స్థానిక పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను శక్తి వంచన లేకుండా నిర్వర్తించి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. ఈ సందర్భంగా సారథికి పార్టీ నేతలు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

నూతన కమిటీల నియామకం

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆలయ శాశ్వత చైర్మన్ రాజాన సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ నూతన కమిటీ చైర్మన్‌గా రొంగల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా చిట్లూరి సర్వేశ్వరరావు, గాలి నూకరాజు, ప్రధాన కార్యదర్శిగా చిటికెన రాంబాబు, సహాయ కార్యదర్శిగా రొంగల పుల్లయ్య, తెల్లగొర్ల సత్యనారాయణ, కోశాధికారిగా నౌడు నూకరాజు, కమిటీ కోర్ ఆర్గనైజర్‌గా గొట్టుముక్కల వంశీ కుమార్‌రాజు ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఈమని శశి కుమార్‌శర్మ నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే 38 మంది మహిళలతో ప్రత్యేక మహిళా కమిటీని ఏర్పాటు చేసినట్లు రాజాన సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో విద్యావేత్త కారింగుల పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: నవభారత్ పామాయిల్ కర్మాగారంలో చోరీకి సంబంధించి స్టోర్ ఇన్‌చార్జి జాస్తి మురళీమోహన్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. మురళీమోహన్ మంగళవారం స్టోర్ వెరిఫికేషన్‌లో భాగంగా స్టోర్‌లోని బ్రాంజ్ మెటల్ బుష్‌లు వెరిఫై చేయగా, 37 బుష్‌లు అదృశ్యమైనట్లు గుర్తించామన్నారు. వాటి విలువ సుమారు రూ.1.75 లక్షలు ఉంటుందన్నారు. ఈ మేరకు మురళీమోహన్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముంపు గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలి

వేలేరుపాడు: గోదావరి వరదల దృష్ట్యా ముంపు గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండలంలోని ఇప్పలగుంపు, ఉదయ నగర్, పూచిరాల, పాత పూచిరాల శాఖ సమావేశాలు ఆయా గ్రామాల్లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి వరదల సమయం ఆసన్నమైందన్నారు. వరదలకు ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని కోరారు. పోడు వ్యవసాయం నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీలకు ఆయా భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జూలై 5, 6, 7వ తేదీల్లో చింతలపూడిలో నిర్వహించే జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు ఎండీ మునీర్, జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు, కారం దారయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు పిట్టా ప్రసాద్, బాడిశ రాము, రమణ రాజు, పిట్టా వీరయ్య, బంధం నాగేశ్వరరావు, వంజం రాము, తదితరులు పాల్గొన్నారు.

చిరుజల్లులతో ఉపశమనం

కొయ్యలగూడెం: చిరుజల్లులతో తీవ్రమైన ఎండల వేడిమి నుంచి ప్రజలు ఉపశమనం పొందారు. మంగళవారం ఉపరితల ఆవర్తనం వలన కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు. అదే విధంగా భూసారాన్ని పెంచేందుకు పచ్చిరొట్ట విత్తనాలను పెంచుతున్నామని దీనికి ప్రస్తుతం కురుస్తున్న వర్షం ఉపయోగపడుతుందని రైతులు పేర్కొంటున్నారు.

బాలికలు, మహిళల హక్కులపై అవగాహన


ర్యాలీలో పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరి

ద్వారకాతిరుమల: బాలికలు, మహిళలు తమ హక్కులను, బాధ్యతలను తెలుసుకుని లక్ష్యాలను సాధించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరి అన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం కిషోరి వికాశం 2.0 వేసవి సెలవుల కార్యక్రమాలను నిర్వహించారు. అందులో భాగంగా బాలికలు, మహిళలు కాలనీలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయం మహిళా పోలీస్ కె.లక్ష్మీసుజన, అంగన్‌వాడీ ఆయా రేణమ్మ, డ్వాక్రా సీఏ గంగారత్నం తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

జంగారెడ్డిగూడెం: ఉద్యోగ కార్మికుల హక్కులపై దాడి చేస్తున్న కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కేవీ రమణ పిలుపునిచ్చారు. ఉద్యోగ కార్మిక వ్యతిరేక విధానాలపై దేశ వ్యాప్తంగా నిరసన దినం పాటించాలని ఇఫ్టూ జాతీయ కమిటీ పిలుపు మేరకు జంగారెడ్డిగూడెం మార్కెట్ యార్డులో నిరసన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీ రమణ మాట్లాడుతూ మే 20న నిర్వహించవలసిన సార్వత్రిక సమ్మెను యుద్ధ పరిస్థితుల దృష్ట్యా జూలై 9కి వాయిదా వేశామన్నారు. సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కొత్త బస్టాండ్ అబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ డివిజన్ కార్యదర్శి మంచిలి రాజు, పాడిదోలు దుర్గారావు, గంపల వెంకటేష్, ముప్పిడి గంగారాం, యడ్లపల్లి చిన్న, శ్రీను, గెద్దం నాగేంద్ర, యడ్లపల్లి ఏసు, సిరిబత్తుల ఏసు, కట్టా బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.


బుట్టాయగూడెం: ఎంపీడీఓ జ్యోతికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


జంగారెడ్డిగూడెం: నిరసన తెలుపుతున్న సీఐటీయూ, వ్యసాయ కార్మిక సంఘు నాయకులు

కార్మికుల పట్ల కూటమి నిర్లక్ష్యం తగదు

బుట్టాయగూడెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి పథకానికి బడ్జెట్ పెంచాలని కోరుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు తామా ముత్యాలమ్మలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు, వ్యవసాయ కార్మికుల పట్ల అత్యంత నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుందన్నారు. ఉపాధి కార్మికులకు అనేక నెలలుగా బకాయిలు ఉన్నాయని వాటిని చెల్లించే విధంగా కృషి చేయాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన ఒక వినతిపత్రాన్ని ఎంపీడీఓ కె. జ్యోతికి అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు తెల్లం రామకృష్ణ, కేవీపీఎస్ నాయకులు అందుగుల ప్రాన్సిస్, నాయకులు వెట్టి వీరయ్య, బుల్లెమ్మ, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా అక్రమ తవ్వకాలు


అనుమతులు లేకుండా తవ్వకాలు చేస్తున్న చెరువు

కొయ్యలగూడెం: మట్టి అక్రమ తవ్వకాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతుంది. యథేచ్ఛగా సాగునీటి చెరువుల నుంచి అక్రమంగా మట్టి తవ్వకాలు నిర్వహిస్తూ అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మంగళవారం కన్నాపురం పంచాయతీ మహాదేవపురం చెరువు నుంచి సాయంత్రం వేళ మొదలుకొని తెల్లవారు జాము వరకు ఇటుక బట్టీలకు, లే అవుట్లకు, ట్రక్కుల్లో మట్టి తోలకాలు నిర్వహిస్తున్నారు. తోలకాలకు సంబంధించి ఏ విధమైన అనుమతులు లేనప్పటికీ కూటమి నాయకుల అండదండలతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. అక్రమ మట్టి తవ్వకాలను నిరోధించాల్సిన పలు ప్రభుత్వ శాఖల అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని, ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మత్స్యకార సంఘం ఏర్పాటు చేయాలి


ఈవోపీఆర్‌డీకి వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకారులు

టి.నరసాపురం: బొర్రంపాలెం పంచాయతీలో మరో మత్స్యకార సంఘాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. బొర్రంపాలెం సచివాలయం వద్ద మత్స్యకార సంఘ సభ్యులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న మత్స్యకార సంఘం సుమారు 300 మందితో కొనసాగుతుందన్నారు. సంఘంలో చీలికలు తెచ్చేందుకు కొంతమంది పంచాయతీలో ఉన్న 14 మంది వార్డు సభ్యుల్లో 9 మందికి తెలియకుండా తీర్మానం చేశారన్నారు. దీనిని రద్దు చేయాలని నినాదాలు చేశారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు తీర్మానం రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు మండల విస్తరణ అధికారి శ్రీనివాసులుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మత్సకార సంఘం నాయకులు బత్తుల రమేష్, గుండె చిన చిట్టియ్య, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా రోడ్డు విస్తరణ పనులు


రోడ్డు విస్తరణ పనులు చేస్తున్న సిబ్బంది

బుట్టాయగూడెం: జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటైన జాతీయ రహదారి 365బీబీ విస్తీర్ణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో జీలుగుమిల్లి నుంచి పోలవరం వరకూ రెండు వరుసల లైన్లు పూర్తి కాగా ప్రస్తుతం మరో 2 వరుసల పనులు జరుగుతున్నాయి. దీనికి సంబంధించి పనులను బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో చురుగ్గా సాగుతున్నాయి. ఏజెన్సీ ఏరియాలో పోలవరం ప్రాజెక్టు ప్రాధాన్యత, ఇతర అంశాలను దృష్టిలో పెట్టుకుని ఈ జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. జీలుగుమిల్లి నుంచి పట్టిసీమ మీదుగా రాజమండ్రి వరకూ మొత్తం 86.5 కిలోమీటర్ల మేర ఈ రహదారి ఉంది.

సీపీఐ మహా సభలను జయప్రదం చేయండి

చింతలపూడి: ఏలూరు జిల్లా సీపీఐ రెండో మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ ఆహ్వాన సంఘం అధ్యక్షుడు మామిళ్ళపల్లి వసంతరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లా మహా సభల ఆహ్వాన సంఘ సమావేశం మంగళవారం మామిళ్లపల్లి వసంతరావు అధ్యక్షతన నిర్వహించారు. జూలై 5, 6, 7 తేదీల్లో చింతలపూడి పట్టణంలో జిల్లా మహాసభలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల గురవయ్య, తొర్లపాటి బాబు, దొంతా కష్ణ, ఎస్‌కే మస్తాన్, అలెగ్జాండర్, మాణిక్యాలరావు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

జంగారెడ్డిగూడెం: తునిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అపోలో ఫార్మసీ ఉద్యోగుల కుటుంబాలను ఆ సంస్థ ఆదుకోవాలని బీఎస్పీ నాయకులు మర్రి కిరణ్ డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మే 17న విశాఖపట్నంలో అపోలో ఫార్మసీ కంపెనీ మీటింగ్‌ను పూర్తి చేసుకుని కారులో తిరిగి వస్తున్న ఉద్యోగులు తుని వద్ద ప్రమాదంలో మృతి చెందారన్నారు. పది గంటల వరకు మీటింగ్ నిర్వహించి, ఉదయాన్నే విధులకు హాజరవ్వాలనే ఒత్తిడే ఈ ప్రమాదానికి కారణమన్నారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

సచివాలయాల క్లస్టర్ విధానం సరికాదు


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న విఆర్‌వోలు

గణపవరం: రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాలను జనాభా ప్రాతిపదికన క్లస్టర్ విధానం తీసుకువచ్చి రెండు సచివాలయాలను ఒక క్లస్టర్‌గా చేయాలన్న నిర్ణయం సరికాదని గణపవరం మండల వీఆర్‌వో అసోసియేషన్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు గణపవరం తహసీల్దార్ అప్పారావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ క్లస్టర్ విధానం వలన 7500 మంది వీఆర్‌వోలు మిగులుగా ఉంటారని వీరిని ఎలా సర్దుబాటు చేస్తారన్నది ప్రభుత్వం వివరించలేదన్నారు. ప్రస్తుతం రీసర్వే చేస్తున్న సమయంలో రెండు సచివాలయాలకు ఒక వీఆర్‌వోను నియమించాలన్న నిర్ణయం సరికాదని, దీనివలన పనిభారం విపరీతంగా పెరిగిపోయి తీవ్ర ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల వీఆర్‌వోల సంఘం అధ్యక్షుడు కేశవమూర్తి, పలువురు విఆర్‌వోలు పాల్గొన్నారు.

జీఓ–4 నుంచి వీఆర్‌ఓలను మినహాయించాలి

భీమడోలు: జీవో నంబర్–4 గ్రామ రెవెన్యూ అధికారులను పలు ఇబ్బందులుకు గురి చేస్తుందని వీర్వోలు భీమడోలు తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. తక్షణం ప్రభుత్వం వీర్వోల విషయంలో తీసుకున్న నిర్ణయాన్ని పునరాలోచించాలని ఆ వినతి పత్రంలో వీర్వోలు కోరారు. సంఘం అధ్యక్షుడు కందులపాటి శంకర్, వినయ్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు రహదారులకు మోక్షం

- రోడ్ల నిర్మాణానికి మున్సిపల్ కార్యవర్గం తీర్మానం
- తీరనున్న ప్రయాణికుల కష్టాలు


అధ్వానంగా ఉన్న శ్రీనివాసపురం రోడ్డు

జంగారెడ్డిగూడెం: అధ్వానంగా ఉన్న రోడ్లకు మోక్షం కలగనుంది. మున్సిపల్ పాలకవర్గం రోడ్ల నిర్మాణానికి తీర్మానించింది. పట్టణంలో ప్రధాన రహదారులైన శ్రీనివాసపురం రోడ్, సుబ్బంపేట రోడ్ నిర్మాణానికి మున్సిపల్ కార్యవర్గం సంకల్పించింది. ఇందు కోసం 15వ ఆర్థిక సంఘం నిధులు, మున్సిపల్ సాధారణ నిధులు వెచ్చించనున్నారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి జంగారెడ్డిగూడెం పట్టణాన్ని కలిపే శ్రీనివాసపురం రోడ్డు నిత్యం రద్దీతో ఉంటుంది. బుట్టాయగూడెం మండలంలోని గుబ్బలమంగమ్మ గుడికి ఈ రహదారి గుండానే వెళతారు. ఏ అవసరం వచ్చిన చుట్టుపక్కల ప్రధాన పట్టణం కావడంతో ఏజెన్సీ ప్రాంతాలైన జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల నుంచి జంగారెడ్డిగూడెం వస్తుంటారు.

శ్రీనివాసపురం రోడ్డులోనే ప్రభుత్వ కార్యాలయాలు

శ్రీనివాసపురం రోడ్డులో డిగ్రీ, జూనియర్ కాలేజ్, 100 పడకల ఆసుపత్రి, బీఎస్ఎన్ఎల్, రిజిస్ట్రార్ కార్యాలయం తదితర ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ఈ రహదారి స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి శ్రీనివాసపురం బైపాస్ జంక్షన్ వరకు అధ్వానంగా తయారైంది. గోతుల మయంగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 1.2 కిలోమీటర్ల మేర రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ నేపథ్యంలోనే మున్సిపల్ కార్యవర్గం ఈ రోడ్డు నిర్మాణానికి తీర్మానించింది. 1.2 కిలోమీటర్ల మేర రోడ్డును నిర్మించేందుకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.71 లక్షలు, మున్సిపల్ సాధారణ నిధులు రూ.70 లక్షలు, మొత్తం రూ.1.41 కోట్లు వెచ్చించనున్నారు. అయితే 15వ ఆర్థిక సంఘం నిధులు వెచ్చించేందుకు అనుమతుల కోసం ఏడీపీ (యాన్యువల్ డెవలప్‌మెంట్ ప్లాన్)కు పంపినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి తెలిపారు. అనుమతులు రాగానే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం మున్సిపల్ కార్యవర్గం కృషి చేస్తోంది. ప్రధాన రహదారులైన శ్రీనివాసపురం రోడ్, సుబ్బంపేట రోడ్ల నిర్మాణానికి తీర్మానాలు చేశాం. ఇప్పటికే సుబ్బంపేట రోడ్డు రూ.70లక్షలతో నిర్మాణం ప్రారంభమైంది. శ్రీనివాసపురం రోడ్ నిర్మాణానికి ఏడీపీ అనుమతుల కోసం పంపించాం. అనుమతులు రాగానే ఆర్థిక సంఘం నిధులు, మున్సిపల్ సాధారణ నిధులతో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం.

– బత్తిన లక్ష్మి, చైర్‌పర్సన్, జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ